క్లుప్తంగా

అయ్యప్ప లక్ష మంత్రార్చన



మంత్రోచ్ఛారణ చేస్తున్న అయ్యప్ప స్వాములు

బెల్లంపల్లి: బెల్లంపల్లి అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం అయ్యప్పస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. సహస్ర నామాలలోని ఒక మంత్రమైన 'ఓం వేట శాస్రే నమః ' అనే పదంతో అయ్యప్ప మాలధారణ వేసుకున్న దీక్షాపరులు లక్షసార్లు మంత్రోచ్ఛారణ చేశారు. ఏకధాటిగా గంటన్నర పాటు విరామం లేకుండా అయ్యప్ప నామస్మరణ, శ్లోకాల పారాయణం చేశారు. ఎంతో నిష్టతో అయ్యప్పస్వాములు చేసిన లక్ష మంత్రార్చన కార్యక్రమంతో ఆధ్యాత్మికత వెల్లి విరిసింది. కార్యక్రమంలో వేద పండితులు కుటుంబ రావు, అనిల్, కోటేశ్వరరావు, అయ్యప్ప స్వాములు సత్యం, రఘు, అనుదీప్, సాయి, రాజు, రాజేష్, భక్తులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న రాజేశ్వరి

బెల్లంపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న నిర్వాహకుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు డి.రాజేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నాలుగు నెలల నుంచి బిల్లులు రాక నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అప్పులు చేసి వంట చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. రాగిజావ వండి పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది కానీ, దానికయ్యే ఖర్చును ఇవ్వడం లేదన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకొని, నిర్వాహకులపై భారం పడకుండా చూడాలని కోరారు. సమావేశంలో సభ్యురాళ్లు శారద, సరోజ, రాజమ్మ, శ్యామల, రాజేశ్వరి, ఓదెమ్మ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

12మందికి కంటి ఆపరేషన్లు



బాధితులతో వైద్యులు

చెన్నూర్: పట్టణంలో బండారి రాజేశ్వరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోటపల్లి మండలంలోని సిర్సా, పుల్లగామ గ్రామాలకు చెందిన నిరుపేదలకు 12మందికి శనివారం ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించినట్లు వైద్యులు అభిషేక్ చిందం తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ బండారి లక్ష్మణ్, వైద్య బృందం, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.


విద్యార్థులు, యువత మత్తుకు బానిస కావొద్దు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

దండేపల్లి: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తహసీల్దార్ సంధ్యారాణి సూచించారు. యూఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలను వ్యతిరేకిస్తూ ముద్రించిన, పోస్టర్లను తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఆవిష్కరించారు. మత్తుపదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయన్నారు. విద్యార్థులు, యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి జీవిత లక్ష్యాలు సాధించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలను వ్యతిరేకించాలన్నారు. ఆర్ఐ భూమన్న, యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మిట్టపెల్లి తిరుపతి, సంఘనాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎంఈవో

మంచిర్యాలఅర్బన్: స్థానిక కేజీబీవీని మంచిర్యాల ఎంఈవో మాళవి దేవి శనివారం పరిశీలించారు. కేజీబీవీలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు 19రోజులుగా సమ్మెబాట పట్టారు. ఈ సందర్భంగా ఎంఈవో విద్యార్థులను ఏమైనా సమస్యలున్నాయా..? అడిగి తెలుసుకున్నారు. ఇదివరకు నేర్చుకున్న పాఠ్యాంశాలను బోర్డుపై రాయించారు. పది, ఇంటర్ విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

న్యూ ఇయర్ సందడి

- ఆకర్షణీయ కేకులు సిద్ధం
- మార్కెట్లో రంగుల కొనుగోళ్లలో బిజీబిజీ
- కానుకలుగా డైరీ, క్యాలెండర్లు లభ్యం

సండే స్పెషల్

మంచిర్యాలఅర్బన్: నూతన సంవత్సరంలోకి అడుగు పెడుతున్నాం. యువత రొటీన్‌కు భిన్నంగా జరుపుకునేందుకు ఉత్సాహపడుతున్నారు. స్నేహితులు, ఆత్మీయులు, కుటుంబసభ్యులతో న్యూ ఇయర్ సెలబ్రేషన్ జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. అభిరుచులకు తగ్గట్లుగా, వివిధ రకాల ఆకృతుల్లో ఆర్డర్‌పై కేకులు తయారు చేసి ఇస్తున్నట్లు బేకరీల నిర్వాహకులు చెబుతున్నారు. గిఫ్ట్‌లు డైరీలు, క్యాలెండర్లు వ్యాపారులు అందుబాటులో ఉంచగా రంగుల కొనుగోళ్లతో మంచిర్యాల మార్కెట్‌లో సందడి నెలకొంది.



ఆకర్షణీయమైన కేకులు







గిఫ్ట్‌లు భళా..

న్యూ ఇయర్ వచ్చిందంటే ఎవరికి తోచిన విధంగా వారు కానుకలు ఇవ్వటం చూస్తుంటాం. కొంతమంది డైరీలు, ఫొటో ఫ్రేమ్‌లు, ప్రింటెడ్ మగ్గులు, చాక్‌లెట్‌లు ఇలా గుర్తిండిపోయే బహుమతులు ఇస్తుంటారు. ఇందులో ఎన్ని రోజులు మారినా, డైరీ రాసే అలవాటు చాలా మందికి ఉంటుంది. అందుకే డైరీలు ఇచ్చేందుకు మొగ్గుచూపుతారు. ఆలోచనలను భద్రపర్చటం, కార్యాచరణ, ఫలితాలను నమో దు చేయటంతో మళ్లీ తెరిచి చూసే అవకాశం ఉన్న డైరీ లు కీలకంగా మారాయి. న్యూ ఇయర్ సందర్భంగా దుకాణాల యజ మానులు పలు రకాల డైరీలను అందుబాటులో ఉంచారు. రూ.150నుంచి రూ.800వరకు ధరలు పలుకుతున్నాయి.

టేస్టీ కేక్స్..

పిల్లల నుంచి పెద్దల వరకు ఆకర్షించేలా కేకులు సిద్ధం చేస్తున్నారు. వివిధ చిత్రాలతో పాటు మనస్సును హత్తుకునేలా కార్టూన్స్, సీరియల్ బొమ్మలను కేక్‌లపై అందంగా సృష్టిస్తున్నారు. సందేశాత్మకమైన కేకులు రెడీ చేస్తున్నారు. బ్లూబెర్రీ, బ్లాక్ కరెంట స్ట్రాబెర్రీ, రెడ్‌వెల్ వైట్, బ్లాక్‌ఫారెస్ట్, బెస్ట్ ఫ్రూట్, కస్టర్డ్స్, నట్స్, బటర్ క్రీమ్ టేస్టీటేస్టీగా తయారు చేసి ఇస్తున్నారు. కేక్‌లను బట్టీ ధరలు రూ.150నుంచి రూ.1000లోపు పలుకుతున్నాయి.

రంగులే రంగులు..



కొత్త సంవత్సరం వేళ గ్రీటింగ్‌కార్డు, గిఫ్ట్‌లతో పాటే ముగ్గులకు అంతే ప్రాధాన్యం. ముగ్గు, కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ రంగు రంగులతో తీర్చిదిద్దుతుంటారు. ముందస్తుగా మంచిర్యాల మార్కెట్లో రంగులు కొనుగోళ్లతో సందడిగా మారింది.





ఇంటికో ప్లాస్టిక్ డ్రమ్ము

తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లో తాగునీటి సరఫరాకు ఆటంకం కలగడంతో నీటి సమస్య తీవ్రతరమైంది. సింగరేణి, గ్రామ పంచాయతీ అధికారులు ట్యాంకుల ద్వారా నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంతో ప్లాస్టిక్ డ్రమ్ములకు ఎక్కడ లేని డిమాండ్ వచ్చింది. నీళ్ల కోసం డ్రమ్ములను కొనుగోలు చేసి తీసుకొచ్చి ఇళ్ల ముందర ఉంచుతున్నారు. ప్రతీ ఇంటి ముందు డ్రమ్ములు బారులుగా కనిపిస్తున్నాయి. అవసరాలకు అనుగుణంగా నీటిని నిల్వ చేసి ఉంచడానికి ప్రతీ ఇంటి ముందర ఒక్కో డ్రమ్ము దర్శనమిస్తోంది. రోజువారీగా డ్రమ్ములు కొనుగోలు చేసి తీసుకు వస్తుండటంతో మాదారం టౌన్‌షిప్ అంతా డ్రమ్ములమయంగా మారింది.

- తాండూర్

సింగరేణి రిటైర్మెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడిగా శంకర్



శంకర్‌ను సన్మానిస్తున్న రిటైర్డ్ కార్మికులు

మందమర్రిరూరల్: సింగరేణి రిటైర్మెంట్ కార్మిక సంఘాన్ని శనివారం స్థానిక సింగరేణి హైస్కూల్ గ్రౌండ్ ఆవరణలో నూతన అధ్యక్షుడిగా వాసాల శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. సింగరేణిలో విధులు నిర్వర్తించినన్ని రోజులు యాజమాన్యం అన్ని సౌకర్యాలు కల్పించిందని, రిటైర్మెంట్ అయ్యాక పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రిటైర్మెంట్ కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించాలని, ఏరియాల్లో ఖాళీగా ఉన్నటువంటి క్వార్టర్లు కేటాయించాలని, క్వార్టర్లు అందుబాటులో లేకుంటే 250గజాల స్థలం ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏరియాలోని రిటైర్మెంట్ కార్మికులు పాల్గొన్నారు.

'బకాయిల వసూళ్లలో సంఘాలు విఫలం'



మాట్లాడుతున్న శ్రీనివాస్

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వసూలు చేయడంలో సింగరేణి గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు విఫలమయ్యాయని హెచ్చెమ్మెస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు జక్కనబోయిన శ్రీనివాస్ ఆరోపించారు. ఏరియాలోని హెచ్చెమ్మెస్ ఆఫీస్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు యాజమాన్యానికి తొత్తులుగా మారాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనికో రేటు చొప్పున జనరల్ షిఫ్టు, డిప్యూటేషన్, క్వార్టర్‌ల అలాట్‌మెంట్ వంటి పనులు చేయిస్తూ కార్మికుల వద్ద మామూళ్లు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో ఆ యూనియన్ నాయకులు సుదర్శన్, రాజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అశోక్‌కుమార్, రామస్వామి ఉన్నారు.

పోలీసులు సత్ప్రవర్తనతో విధులు నిర్వర్తించాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

జైపూర్: పోలీసులు సత్ప్రవర్తనతో బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. జైపూర్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిట్ ఆర్టికల్‌ను తనిఖీ చేసి పోలీస్ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు దృష్టిలో ఉంచుకొని సిబ్బంది క్రమశిక్షణతో ఉండాలని, వాహనాలు నడిపేటప్పుడు ప్రతీ పోలీస్ హెల్మెట్ తప్పకుండా ధరించాలని సూచించారు. అనంతరం స్టేషన్‌కు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెదలాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, స్థానిక ఎస్సై శ్రీధర్, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

వాహన పత్రాలు లేకుంటే చర్యలు



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

శ్రీరాంపూర్: వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ ప్రతాలు లేకుంటే కఠిన చర్యలు తప్పవని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా శనివారం ఆయన శ్రీరాంపూర్ ఏరియాలోని అరుణక్కనగర్‌లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లలో, కాలనీల మధ్య పార్క్‌చేసి ఉన్న వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్ లేని కారణంగా 25టూవీలర్స్, 4ఆటోలు, 5కార్లను సీజ్ చేశారు. అనంతరం కాలనీ వాసులతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌రూల్స్ పాటించాలన్నారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి, పేకాట వంటి చట్ట వ్యతిరేక చర్యలు చేపడితే కఠిన చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్సైలు సంతోశ్, శ్వేత, శ్రీధర్ పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళి



చెన్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

తాండూర్/చెన్నూర్/లక్సెట్టిపేట: దేశ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని కాంగ్రెస్ నాయుకులు అన్నారు. తాండూర్ ఐబీ కేంద్రంలో, చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, లక్సెట్టిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయులు శనివారం మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మన్మోహన్ సింగ్ సేవలను కొనియాడారు.

అవకతవకలు జరగకుండా చూడాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్డీవో కిషన్

లక్సెట్టిపేట: ఉపాధిహామీ పనుల్లో భాగంగా కూలీలందరికి పని కల్పించాలని డీఆర్డీవో కిషన్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో మాట్లాడారు. కొత్తగా పనుల్లో చేరాలనుకునేవారికి జాబ్ కార్డులు ఇవ్వాలని, పనులు జరిగే ప్రదేశంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏ, మేట్‌లు అన్ని వివరాలు సేకరించాలని, కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పనులు జరిగే ప్రదేశంలో గాయాలైతే వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. పది రోజులుగా నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్‌లో బయటకు వచ్చిన వివరాలపై సంబంధిత సిబ్బంది పూర్తి వివరణ ఇవ్వాలని తెలిపారు. మండలం మొత్తంగా జరిమానా రూ.1100, రికవరీ రూ.33,088 చెల్లించాలని సూచించారు. సంవత్సరం మొత్తం మండలం మొత్తంలో రూ.36లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు సరోజ, నాగేశ్వర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ అధికారి శివరాం, ఎస్‌ఆర్పీ ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి'



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

బెల్లంపల్లి: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి పుర వీధుల్లో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి బుర్ర సతీష్ మాదిగ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించి నాన్చడం సరికాదన్నారు. మాదిగలకు ఇచ్చిన హామీని సీఎం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ అమలు కోసం హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్యమాదిగ, నాయకులు జె.శంకర్, చిన్నరాజం, రత్నం ఐలయ్య, కొమురయ్య, రామకృష్ణ, రామగిరి మహేష్‌కుమార్, కాంపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'ఇసుక తవ్వింది అటవీ భూమిలో కాదు'



ఇసుక తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ

వేమనపల్లి: నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ నిర్మాణ పనుల అవసరాల కోసం ఇసుక తీసింది అటవీ భూమిలో కాదని ఇరిగేషన్ డీఈ వెంకటస్వామి అన్నారు. నీల్వాయి ప్రాజెక్టు కాంట్రాక్ట్ సిబ్బంది, ఏఈలతో కలిసి శనివారం ఎడమ కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. అటవీశాఖకు చెందిన భూమిలో ఇసుక తవ్వుతున్నారని గ్రామస్తులు అటవీ అధికారులకు ఫిర్యాదు చేయగా అధికారులు ప్రొక్లెయిన్‌ను ఆధీనంలోకి తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో అటవీ శాఖ, ఇరిగేషన్, రెవెన్యూ హద్దులను అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. అటవీశాఖ అడ్డంకితో గత ఆరు సంవత్సరాల క్రితం కాలువ నిర్మాణ పనులు నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వం సుమారు రూ.3 కోట్ల పరిహారం చెల్లించి భూమికి బదులు భూమి అటవీశాఖకు ఇచ్చినట్లు తెలిపారు. దీంతో అటవీ, వైల్డ్‌లైఫ్ అనుమతులు లభించడంతో పనులు ప్రారంభమయ్యాయన్నారు. అటవీ, ఇరిగేషన్, ప్రాజెక్టు నిర్మాణ పనుల సిబ్బంది ఉమ్మడి సర్వే చేసి అనుమతి లభించిన భూమిలోనే కాలువ కోసం తవ్వకాలు జరుపుతున్నామన్నారు. అటవీశాఖ సరిహద్దు వెలుపలే మత్తడి వాగులో ఇసుక తవ్వకాలు చేశారని తెలిపారు. అటవీ శాఖ ప్రొక్లెయిన్‌ను అదుపులోకి తీసుకొని పనులకు తాత్కాలికంగా ఆటంకం కలిగించడం బాధాకరమన్నారు. అవసరమైతే జాయింట్ సర్వే నిర్వహించి మళ్లీ హద్దులు నిర్ణయించాలని సూచించారు.

అవినీతిపై పోరాడుతున్నందుకే భౌతిక దాడులు

- ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్



మాట్లాడుతున్న సుధాకర్

నస్పూర్: నేటి సమాజంలో జరుగుతున్న అవినీతిపై పోరాడుతున్నందుకే తమ పార్టీ కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన నాయకులతో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నదీం పాషాపై ఈ నెల 18న కొందరు వ్యక్తులు దాడి చేసి అతడిని హతమార్చాలని చూసారని ఆరోపించారు. ఈ దాడిని ఖండిస్తున్నామన్నారు. తనపై దాడి చేసిన రేనిగుంట వెంకటేశ్, సాయితేజతో పాటు మరో ముగ్గురిపై అదే రోజు నదీంపాషా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. స్థానిక పోలీసులు దాడి చేసినా, వారిపై నామ మాత్రపు కేసు నమోదు చేసి చేతులు దులుపేసుకున్నారని తెలిపారు. కేసు విచారణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ దోషులను తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో సైతం తమ కార్యకర్తలు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

సామాజిక సేవకుడు సుదర్శన్‌గౌడ్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సుదర్శన్‌గౌడ్

రామకృష్ణాపూర్: సామాజిక సేవలో రాణిస్తున్న పట్టణానికి చెందిన కంభగోని సుదర్శన్‌గౌడ్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్, రిసర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుదర్శన్‌గౌడ్ డాక్టరేట్‌ను అందుకున్నారు. 20సంవత్సరాలుగా సమాజ సేవలో ముందుంటూ, వివిధ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతున్నందుకు గుర్తింపుగా డాక్టరేట్‌ను అందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్: పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో ఆదివారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ మోహన్‌రెడ్డి శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత మంచిర్యాలలోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం కలుగుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆర్థిక సాయం అందజేత

రామకృష్ణాపూర్: పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ రాజబాబు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, అతడి కుటుంబానికి ఆటో యూనియన్ సభ్యులు శనివారం ఆర్థికసాయం అందించారు. నిరుపేద కుటుంబం కావటంతో తమవంతు చేయూతగా రూ.10వేల సాయం అందించినట్లు తెలిపారు. ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు గాండ్ల సమ్మయ్య, అధ్యక్షుడు ఎనగంటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

దుప్పట్లు పంపిణీ

జన్నారం: మండల కేంద్రంలో రాఘవేంద్ర సంస్థ ఆధ్వర్యంలో శనివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ మాట్లాడుతూ.. చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాగుల శంకర్, రాజ్‌కుమార్, శ్రీకాంత్, రాఘవేంద్ర సంస్థల నిర్వాహకులు ఉన్నారు.

నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి

జన్నారం: ప్రపంచం వేగంగా మారుతున్న ఈ కా లంలో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, గ్లోబల్ సమస్యలపై కనీస అవగాహన కలిగి ఉండాలని యునైటెడ్ నేషన్స్‌లో ప్రాతినిధ్యం వహించిన న్యాయవాది పి.సురేందర్ అన్నారు. జన్నారం స్లేట్ హైస్కూల్‌లో శనివారం మోడల్ యునైటెడ్ నేషన్స్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో చర్చనైపుణ్యాలు, సహకార సామర్థ్యాలను అభివృద్ధి చేసేందుకు ఇది ఒక చక్కని వేదికగా నిలుస్తుందన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఆసంపల్లి తిరుపతి కుమారుడు విజ్ఞాన్ పుట్టిన రోజును పురస్కరించుకొని పాఠశాలలో 46మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి, ప్యాడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో సంపత్, అజయ్ పాల్గొన్నారు.

టీఎన్జీవో సభ్యత్వ నమోదు

దండేపల్లి: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో టీఎన్జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం సంఘ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం లక్సెట్టిపేట తాలూకా ఇన్‌చార్జి భూమన్న, మండల నాయకులు పాల్గొన్నారు.